# లవ్ స్టోరీ

## జవానీ కి కహానీ!

**ఉదయం ఎనిమిది గంటల సమయం.**

**సెలవలు పూర్తి అయిన తరువాత తెరిచిన కాలేజి స్టూడెంట్స్‌తో కోలాహలంగా వుంది. నేను - నా ఫ్రెండ్సుతో కలిసి కాలేజి ఆవరణలో కొచ్చి నిలబడ్డాను. నా ఫ్రెండ్సంతా వారి వారి గర్ల్ ఫ్రెండ్స్‌ను వెతుక్కునే ప్రయత్నం లో వున్నారు. నాకు మాత్రం గర్ల్ ఫ్రెండ్ లేదు. నన్ను ప్రేమించాలంటే ఏ అమ్మాయికైనా సరే రెండు గుండెలు కావాలి.**

— గరల్స్‌ను 'టీజ్' చేయడం నా హాబీ!

కేవలం 'టీజ్' చేయడం వరకే!

అందుకే ఆడపిల్లలంతా నన్ను 'రౌడీ' అంటారు.

ఆడపిల్లలు 'రౌడీ' అనాలంటే పెద్ద గూండా పనులేమీ చేయాల్సిన అవసరం లేదు కదా! ఆ కారణంగానే నేను ఏ అమ్మాయి ప్రేమనూ నోచుకోలేదు. ఆ ఉద్దేశమే వుంటే వాళ్ళ ప్రేమను పొందడం నాకు కొన్ని నిమిషాల పని!

— నా అందం మీద నాకంత నమ్మకం.

అందం ఉన్నంత మాత్రాన అమ్మాయిలు ప్రేమిస్తారా? అనే మంచి సందేహం ఏ పాఠకుడి (పాఠకురాలు)కైనా కలిగిందంటే ... వెంటనే నేను 'హీరో' కుండాల్సిన లక్షణాలన్నీ నాకు వున్నాయి అని చెప్పాల్సి వస్తుంది.

— హీరోను ప్రేమించని హీరోయిన్స్ వుంటారా?

ఆ విధంగానే నా రెండు సంవత్సరాల డిగ్రీ పూర్తయింది. మూడో సంవత్సరం కూడా అలాగే ముగిసిపోయేదేమో! అకస్మాత్తుగా నాలో 'పూజిత' ప్రవేశించింది.

— 17 సంవత్సరాల పూజిత!

***

కాలేజీ తెరిచిన రెండో రోజు —

నా చూపులు ఎదురుగా వున్న అమ్మాయి మీద కేంద్రీకృతమయ్యాయి. నల్లటి చారలున్న నీలి రంగు పంజాబీ డ్రెస్‌లో అద్వితీయంగా వుంది. వెడల్పాటి నీలి రంగు కళ్ళు ఆ అమ్మాయికో పెద్ద ఎస్సెట్.

నీలిరంగు డ్రెస్‌లో నీలి రంగు కళ్ళతో వున్న ఆ అమ్మాయిని చూడగానే 'కావాలి' అనిపించింది.

ఇన్నాళ్ళూ రూపం లేని అమ్మాయిని తలచుకున్న నాకు ఆ రాత్రి ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది.

***

సూర్యుని వెలుగు గదంతా పరుచుకుంది. నాకు మెలుకువ వచ్చింది. ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది. ఎందుకో హృదయంలోని ఆనందమంతా నవ్వుగా మారి పెదవుల మీద తారట్లాడినట్టయింది.

ఆ అమ్మాయిని చూడబోతున్నాను అనే ఉద్విగ్నతతో ఒక్క ఉంగలో బెడ్ దిగి చేయాల్సిన కార్యక్రమాలన్నీ త్వరగా పూర్తి చేసుకొని 'డ్రెస్' అయ్యాను. ఎప్పుడు కాలేజి కెళ్ళినా ఓ గంట లేటుగా వెళ్ళే నేను ఏడు గంటలకే తయారవ్వడం చూసి అమ్మ ఆశ్చర్యపోయింది. అమ్మ మనసును గ్రహించిన వాడి మల్లే అన్నాను.

"ఈ రోజు మాస్టర్ చెప్పే 'లెసన్' చాలా ఇంపార్టెంట్!" ఎంత అబద్ధమైన వాక్యమో! ఆ మాటలు విని అమ్మ మరింత ఆశ్చర్యపోయింది.

"త్వరగా టిఫిన్ పెట్టు" అన్నాను.

ఇక అమ్మ నా గురించి పట్టించుకోకుండా టిఫిన్ పెట్టి వెళ్ళిపోయింది.

తినడం పూర్తిచేసి అక్కడ్నించి కదిలాను.

— చేతిలో మాత్రం పుస్తకాలు లేవు.

***

నాకు లేడీస్‌ను 'టీజ్' చేయడమే తెలుసు కాని, అందంగా పలకరించడం తెలియదు. ఇప్పుడా అమ్మాయిని 'టీజ్' చేస్తూ పలకరించాలా? అందంగా పలకరించాలా-ఆ విషయం గురించి ఓ పావు గంట ఆలోచించాను. చివరకు అందంగా పలకరించటానికే నిర్ణయించుకున్నాను.

ఆ అమ్మాయి నడచివస్తోంది హంసలాగ! ఇక ఆలోచించే వ్యవధి లేనట్టుగా నేను ఆ అమ్మాయి పక్కకు వెళ్ళి అన్నాను.

"ఎవరన్నా మిమ్మల్ని గోల చేస్తే నాతో చెప్పండి. రసరస స్పష్టిస్తా!"

కుక్కతోక ఎప్పుడూ వంకరే! మనకు మాత్రం మాటలు అందంగా ఎక్కడి నుంచి వస్తాయి? ఆ అమ్మాయి మాత్రం సింపుల్‌గా — "ఆ విషయం నేను చూసుకోగలను. మీ సలహా ఏం అవసరం లేదు" అంది. 'మీరే పెద్ద రౌడీలాగ వున్నారు!' అన్నట్టుగా వున్నాయి ఆ మాటలు.

అదీ అక్కడొచ్చింది నాకు కోపం! అంతే. పెద్దగా "ఏం చూసుకోగలవు నువ్వు?" అన్నాను కోపంగా. ఆ అమ్మాయి మాత్రం ఇంకా చిన్నగా లోగొంతుకతో "మీరు కొంచెం మర్యాదగా మాట్లాడండి. ఏకవచనం ప్రయోగిస్తున్నారు. నన్ను వెళ్ళనివ్వండి" అంది.

నేను పక్కకు తప్పుకున్నాను. ఆ అమ్మాయి నా ముందు నుంచి వెళ్ళిపోయింది.

— ఒక అమ్మాయి మాట వినడం నా కాలేజి లైఫ్ లోనే ఫస్ట్ టైమ్.

అప్పటికే మమ్మల్ని గుర్తించిన కొందరు స్టూడెంట్స్ ఏం జరగకపోయేసరికి మౌనంగా ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు.

ఆ రాత్రంతా బాగా ఆలోచించాను. ఇక్కడ విశేషం ఏమిటంటే ఆ అమ్మాయి మీద నాకు కోపం రాకపోవడం. ఎలాగైనా సరే ఆ అమ్మాయి ప్రేమను పొందాలి అని నిశ్చయించుకున్నాను.

అప్పుడొచ్చింది నాకా ఆలోచన! అసలు ముందు ఆ అమ్మాయి పేరు తెలుసుకోవాలి. అది పెద్ద కష్టమైన పనేమీకాదు. నా ఫ్రెండ్ 'రాం కేశవ్' గర్ల్ ఫ్రెండ్ 'జ్యోతి'ని అడిగితే తెలుస్తుంది.

ఆ మరుసటి రోజే ఆ అమ్మాయి పేరు నాకు తెలిసింది. నా కంటే ముందుగా పాఠకులకు తెలిసింది.

— పూజిత!

***

కాలేజి తెరిచిన నాల్గవ రోజు. కాలేజి వదిలిన రెండు గంటల తరువాత జరిగిన సంఘటన అది!

నేను — రాంకేశవ్ కొత్త 'షాప్' కొనుక్కొని వస్తున్నాము. ఆకాశంలో ఎగురుతున్న పావురాల గుంపు నుంచి ఓ పావురం ఆగింది. జనంలో దేవతలా దూరం నుంచి కనిపిస్తున్న పూజిత!

— అప్పుడొచ్చింది నాకా ఆలోచన!

ఓ గులాబి పువ్వును కొని పూజిత దగ్గరగా వచ్చిన తరువాత దాన్ని చేతిలోకి తీసుకొని ఆమె గుండెకు తగిలేటట్టుగా విసిరాను. గురి తప్పలేదు. నేనెక్కడైతే కొట్టాలనుకున్నానో అక్కడే తగిలింది.

పూజిత మాత్రం నా వైపు కోపంగా చూసి కింద పడ్డ పువ్వును చేతిలోకి తీసుకొని ముక్కలు ముక్కలు చేస్తూ దూరంగా కనిపిస్తున్న పోలీస్‌ను పిలిచింది.

అప్పుడు కనిపించాడు పోలీస్ నా కళ్ళకు యముడిలా. నేను పెద్దగా భయపడలేదు. రాంకేశవ్

మాత్రం అదిరిపడ్డాడు. పోలీస్‌తో చెపుతోంది పూజిత!

"చూడండి! ఎలా అల్లరి చేస్తున్నారో ...?"

ఆ మాటలు విని మా ఇద్దరి వైపు అనుమానంగా చూస్తూ - "ఇద్దరా?" అన్నాడా పోలీస్.

"కాదు. ఇతనే!" నా ఒక్కడి వైపే చేతిని చూపిస్తూ అంది. రాంకేశవ్ మొఖంలో రిలీఫ్. నాకైతే పూజిత నావైపు చేతిని చూపిస్తున్న తీరును చూసి నవ్వొచ్చింది. పోలీసుల బారి నుంచి ఎలా తప్పించుకోవాలో నాకు బాగా తెలుసు. అందుకే మరింత అమాయకుడిలా నటిస్తూ పూజిత రెండు చేతులూ పట్టుకొని అన్నాను.

"నన్ను క్షమించు పూజిత! లేడీస్‌కు పూలంటే ఇష్టమని గులాబి పువ్వు విసిరాను. రాయి విసిరితే కదా పోలీసులకు పట్టించాల్సింది! నీకు పూలంటే ఇష్టం లేదని నాకు తెలియదు. పోలీసులంటే నాకు చచ్చేటంత భయం. ఈసారికి వదిలెయ్యమని చెప్పు. — ఇవి చేతులు కావు నడుము అనుకో"!

"షటప్" పెద్దగా అరిచింది పూజిత.

పోలీసుతో పాటు మేము - మాతో పాటు పోలీసు నడుస్తున్నాము. నాకు మాత్రం ఆనందంగా వుంది. పదే పదే పూజితతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. రాంకేశవ్ మాత్రం ఓరకంట నావైపు చూస్తూ అన్నాడు.

"గురూ! నువ్వు కిషోర్ కిచ్చి రమ్మన్న 50 రూపాయలు ఇంకా ఇవ్వలేదు. పోలీసులు వదిలిన తర్వాత ఇచ్చి వస్తాను."

రాంకేశవ్ మాటలు వింటూనే పోలీస్ మొఖం వెలిగింది. నేను పోలీస్‌నే గమనిస్తూ అన్నాను.

"డబ్బు గురించి మాట్లాడవద్దని అన్నానా...?" అన్నీ అబద్ధాలే!

"లేదు గురూ! యాభై రూపాయలు జేబులో వుండే చెపుతున్నాను." ఆ మాటలు విని నేను పోలీస్ వైపు జాలిగా చూస్తూ అన్నాను-

"వాడికి తర్వాత ఇవ్వవచ్చులే! పాపం పోలీస్ బాబాయ్‌కి ఏమన్నా అవసరమేమో ఇవ్వు." అవసరమే అన్నట్టుగా పోలీస్ తల వూపాడు. యాభై రూపాయలు పోలీస్ చేతిలో పెట్టి అక్కడే ఆగాము. పోలీస్ వెళ్ళిపోయాడు.

పైన సూర్యుడు - కింద మేము - మధ్యలో ఎండ. అప్పుడన్నాడు రాంకేశవ్. — "నువ్వు పూజితను ప్రేమిస్తున్నావు కదూ!" నేను అవునన్నట్టుగా తల వూపాను. రాంకేశవ్ చెప్పడం కొనసాగించాడు.

"పూజిత నిన్ను ప్రేమించేటట్టు చేసే ఐడియా!"

నేను మరింత విస్మయానికి లోనై "ఎలా?" అన్నాను.

"చాలా సింపుల్. నువ్వు వారం రోజుల వరకు కాలేజి వైపు రాకు. అసలు పూజితకే కనిపించకు. కంపల్సరీగా ఆ అమ్మాయి రేపు నీ కోసం చూస్తుంది పోలీసులు వదిలారా లేదా అనే ఆసక్తితో!

"రెండు రోజుల తర్వాత నేను పూజిత దగ్గరకు వెళ్ళి దాదాపు ఏడుపు మొఖం పెట్టి ఇదంతా మీ వల్లనే జరిగింది! ఆ తర్వాత పోలీసులు నీకు పెట్టిన ఉత్తుత్తి చిత్ర హింసల గురించి ఏకరువు పెడతాను.

వారం రోజుల తర్వాత నువ్వు కాలేజికి వస్తావు. పూజిత వైపు మాత్రం చూడవు. చాలా బుద్ధిమంతుడిగా నటిస్తావు.

అప్పుడిక నిన్ను ప్రేమించక ఛస్తుందా...?"

"ఛస్తుందా... గిస్తుందా... అనకు"

"ఒ.కే. ఐడియా ఎలా వుంది?"

"సూపర్..." అన్నాను.

నందివర్ధనం పూలతో రమించిన గాలి అలలు అలలుగా వచ్చి శరీరాన్ని ఆహ్లాద పరుస్తున్న భావన.

* * * *

రెండు రోజుల తర్వాత సాయంత్రం ఆరు గంటల సమయంలో మేడ మీద బాల్కనీలో ఈజీ చైర్‌లో కూర్చొని రోడ్డు మీదికి చూస్తున్నాను. దూరంగా సైకిల్ మీద వస్తూ రాంకేశవ్! వెంటనే నేను చక చక మెట్లు దిగి వాడికి ఎదురెళ్ళాను. వాడు నవ్వుతూ చెప్పాడు.

"నువ్వు జాక్ పాట్ కొట్టినట్టే గురు!"

"వెధవ జోకు లెయ్యకుండా విషయం చెప్పు"

"ఏముంది గురు! నీ కోసం పూజిత కళ్ళు వెతుకుతున్న క్షణంలో నే వెళ్ళి మరీ దయనీయంగా మొఖం పెట్టి 'మా వాడే పాపం చేశాడని అంత పెద్ద శిక్ష విధించారు?'అన్నాను. ఆ అమ్మాయి మరింత 'ఇరిటేట్' అయి 'నేనేం చేశాను'అంది.

'మావాడు మీ మీద ప్రేమ కొద్దీ గులాబి పువ్వును ఇచ్చాడే అనుకోండి. తీసుకుని 'థ్యాంక్స్' అని చెపితే ఎంత బాగుండేది. పోనీ! ఆ పువ్వు తీసుకోవటం మీ కిష్టం లేదనుకోండి- 'నో థ్యాంక్స్' అని చెపితే సరిపోయేది కదా!

-ఆ పోలీసులు ఎన్ని చిత్ర హింసలు పెడుతున్నారో ఏమో'అన్నాను.

"ఆ.. పూజిత ఏమంది?" నా తొందర నాది.

"అయ్యో! ఇప్పుడెలా అని మాత్రం అంది. అంతకంటే ఇంకా ఎక్కువ ఏం మాట్లాడుతుందిలే! నువ్వు మాత్రం రెండు మూడు రోజుల వరకు కాలేజీకి రాకు. వచ్చినా సీరియస్‌గా వుండు."

చెప్పి వెళ్ళిపోయాడు రాంకేశవ్! నేను మాత్రం-

ప్రపంచంలోని పూలన్నీ అలంకరించుకొని సిగ్గుపడుతూ నేల చూపులు చూస్తున్న పూజితను చూస్తూ నిలబడ్డాను.

* * * *

కాలేజి తెరిచిన పదవరోజు. క్లాసరూమ్‌లో మౌనంగా కూర్చుని వున్నాను. నా ముందు పుస్తకాలున్నాయి, నన్ను పరిహసిస్తూ. అప్పుడొచ్చింది పూజిత. నా వైపు విస్ఫారిత నేత్రాలతో చూడడం నేను గమనించాను.

నా చూపులు మాత్రం మరో వైపు వున్నాయి.



లెక్చరర్ వచ్చి లెసన్ చెప్పటం ప్రారంభించాడు. క్లాసంతా నిశ్శబ్దం. అప్పుడప్పుడు నా వైపు చూస్తున్న పూజిత! ఇక ఆగలేకపోయాను. ఒకే ఒక్కసారి పూజిత వైపు చూసాను. అంతే.

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. 'సారీ' అన్నట్టుగా చూస్తూంది.

మరుసటి రోజు తలలో గులాబి పువ్వు తురుము కొని వచ్చింది. నేను చూసీ చూడనట్టు వూరుకున్నాను. అలాగే వారం రోజులు గడిచాయి.ఆ వారం రోజులూ నేను పడిన కష్టం చాలా ఎక్కువ!

ఆ రోజు సినిమాకెళ్ళటానికి నిర్ణయించుకున్నాను. 'ప్రేమ పూజారి'. న్యూపిక్చర్! అప్పటికి రిలీజ్ అయి వారం రోజుళే అవుతుంది. నేను థియేటర్లో కెళ్ళేసరికి ఇంకా 'చిత్రవధ' ఫిలింస్ స్టార్ట్ కాలేదు. నా సీట్ నెంబర్ చూసుకొని వెళ్ళి కూర్చున్నాను. కొన్ని నిమిషాల తరువాత నలుగురమ్మాయిలు నేనున్న వరసలోకి రావటం చూశాను.

ఆశ్చర్యం! ఆ నలుగురిలో పూజిత వుంది. నన్ను చూసింది. నేను మళ్ళీ చూసీ చూడనట్టు తెరకేసి చూడడం మొదలు పెట్టాను. పూజిత సరాసరి నా పక్క సీట్లో కొచ్చి కూర్చుంది. ఆ అమ్మాయి పక్కనే మిగతా ముగ్గురమ్మాయిలూ!

నాకైతే మహా 'ఎగ్జైటింగ్'గా వుంది.

'దేవుడా! నువ్వున్నావు' అనుకున్నాను. థియేటర్లో లైట్లు ఆరాయి. 'చిత్రవధ' ఫిలింస్ మొదలయ్యాయి. తరువాత సినిమా మొదలయ్యింది. అందరూ సినిమా చూడడంలో నిమగ్నమయి వున్నారు.

పూజిత మాత్రం తలను కొంచెం నా వైపుకు తీసుకొచ్చి లో గొంతుతో అంది.

"హలో రౌడీ అబ్బాయి గారు! తమరు రౌడీ అని నాకు తెలుసు కాని, మరీ అలా బుద్ధిమంతుడిలా కూర్చోకు!"

నేను అదిరిపడి తల తిప్పి ఆ చిరు చీకటిలోనే పూజిత మొఖాన్ని చూశాను. నవ్వు ఆ ముఖానికి అలంకారంగా వుంది. ఆ తర్వాత చిన్నగా తన అరచేతిలో నా చేతిని బంధించింది. ఇక నేను వూరుకోవటం ఏమంత మంచి పని కాదు అని తోచేసరికి ఆ చేతిని తప్పి నా చేతిలో బంధించాను. ఇక ఆ తర్వాత నా ధ్యాస సినిమా మీద లేదు.

మేమిద్దరం అలా వుండగానే సినిమా పూర్తయ్యింది. మేమంతా థియేటర్లోనుంచి బయటకొచ్చేసరికి బయటంతా సన్నటి వర్షం పడుతుంది. పూజిత స్నేహితురాళ్ళు ముగ్గురూ రిక్షా కోసం చూస్తున్నారు. నేను మాత్రం ఎవరూ చూడని సమయం చూసి పూజితకు సైగ చేస్తున్నాను, 'వాళ్ళతో వెళ్ళకు- ఇద్దరం కలసి వెళదాము' అని. నా బాధ నాది!

రెండు గంటల క్రితం వరకు నేనునటించాను. ఇప్పుడు పూజిత నటిస్తూంది-వస్తున్న నవ్వును పెదాల మధ్య బిగబట్టి,చూసీ చూడనట్టు!

> **రచయిత చిరునామా:**
>
> మహర్షి
> C/O షేక్ బాషుబేగ్
> కొత్తపేట వేపం మార్కెట్,
> విజయవాడ
> కృష్ణాజిల్లా

ఆ ముగ్గురిలో ఒకమ్మాయి రిక్షాను పిలవటం, రిక్షా వచ్చి వాళ్ళ ముందు ఆగటం అంతా నిమిషంలో జరిగింది. నా కైతే మనసంతా 'టెన్షన్' ఆవరించి వుంది. పూజిత వారితో పాటు వెళుతుందా... నా కోసం వుంటుందా? అనే దాని తాలూకూ టెన్షన్ అది.

ఆ ముగ్గురూ రిక్షా ఎక్కారు. నేనలాగే పూజిత వైపు చూస్తున్నాను. పై నుంచి సన్నటి జల్లు కురుస్తూంది. చీకటిని పారదోలిన దీపాల తాలూకు వెలుతురు అక్కడంతా పరుచుకుని వుంది. రిక్షావాడు ఎక్కు తల్లీ అన్నట్టుగా చూస్తున్నాడు. నా వైపు ఓరగా చూసి అంది పూజిత-

"మీరు ముగ్గురూ వెళ్ళండే! మా నాయనమ్మ ఇల్లు ఇక్కడే! ఈ రాత్రికి నాయనమ్మ దగ్గర వుండి రేపు ఉదయం వస్తాను. రేపు కాలేజీలో కలుసుకుందాము. గుడ్ నైట్!"

ఆ ముగ్గురు అలాగే అన్నట్టు తలలూపారు. రిక్షా కదిలింది. ఒంటరిగా నిలబడి వుంది పూజిత. నాకైతే ప్రపంచాన్ని జయించినంత గర్వంగా వుంది. ఆమె ముందుకు వెళ్ళి కళ్ళలోకి ప్రేమగా చూస్తూ అన్నాను, "థాంక్యూ". దానికి ప్రతిగా చిరునవ్వు నవ్వి "వెళదామా!" అంది. "ఇప్పుడే వస్తాను" అని చెప్పి నా యమహా కోసం వెళ్ళాను.

* * * *

నల్లటి తారు రోడ్డు మీద చీకటిని చీల్చుకుంటూ వెళుతూంది యమహా. పై నుంచి పడుతున్న సన్నటి జల్లు-నడుము చుట్టూ చేతిని చుట్టి వెనక పూజిత!

"కలసి రావటం" అనే పదానికి పూర్తి అర్థం ఇప్పుడు తెలిసి వచ్చింది నాకు. సరిగ్గా అప్పుడే సన్నటి జల్లు కాస్తాభారీ వర్షంగా మారుతున్నట్టుగా ఆకాశంలో ఉరుము.

"అయ్యో ఇప్పుడెలా?... వర్షం పెద్దది అయ్యేటట్టుగా వుంది. వారితో పాటు వెళ్ళి వుంటే బాగుండేది."వీపుకు ఆనుకుంటూ, చెవి దగ్గర పూజిత కంఠం. ఆ మాటలు వినీ విననట్టు వెనక్కి తిరిగి పూజిత వైపు చూసి నవ్వుతూ అన్నాను.

"పూజిత! నా మీద నీకే ప్రేమనుకున్నాను. వర్షానిక్కూడ నేనంటే ప్రేమే! మనసుకు వచ్చిన ప్రియురాలితో వర్షంలో తడవడం,... ... ....

-ఆహా! ఆనందానికి ఇంతకంటే పరాకాష్ఠ ఏముంది?

నా కంఠంలో చిలిపితనం. దూరం నుంచి తీతువు అరుపు. ఎక్కువైన వర్షం. యమహా మీద వెళ్ళడం మహా కష్టంగా వుంది. అసలే మన రోడ్లు అంతంత మాత్రం. అసలు వెళ్ళాలనే లేదు నాకు. యమహాను ఆపి చుట్టూ చూశాను. దూరంగా చిన్న గుడిని చూపిస్తూ దీపం వెలుగు.

వర్షంలో తడుస్తూ క్వశ్చన్ మార్కు ఫేసుతో వున్న పూజితతో - "ఇంత పెద్ద వర్షంలో వెళ్ళలేము. వర్షం తగ్గేవరకు ఆ గుడిలో కెళ్ళి నిలబడదామా?" అన్నాను.

మనసులో ఏమనుకుందో ఏమో 'సరే!' అన్నట్టుగా తల వూపింది.

రోడ్డు వారగా యమహాను ఆపి పూజిత చేతిని అందుకొని గుడి కేసి నడిచాను. అది పాడు పడిన గుడి. అక్కడ ఏ దేవుడూ తన మహిమలు చూపించ లేదు. ఆ కారణంగా అక్కడ పూజలేమీ జరగవు. ప్రతి రోజూ సాయంత్రం ఓ వృద్ధ వ్యక్తి వచ్చి దీపాన్ని వెలిగించి వెళుతుంటాడు.

మేమిద్దరం గుడి వసారాలో కెళ్ళి నిల్చున్నాము. తడిసి వుండడం వల్లనేమో చిన్నగా వణుకుతూంది పూజిత. నా చూపులు తన వైపే వుండడం గమనించి చిన్నగా నవ్వింది. దీపం మంట గాలికి అటు ఇటు వూగు తూంది. నేనురెండు అడుగులు పూజిత వైపు వేసి, ఒక చేతిని ఆమె నడుము చుట్టూ చుట్టి దగ్గరకు తీసు కున్నాను.

"నిన్నందరూ 'రౌడీ' అని ఎందుకంటారో ఇప్పుడు తెలిసింది నాకు" అదిరిపడి వదిలేశాను. శబ్దం వచ్చేలా నవ్వటం మొదలుపెట్టింది పూజిత.

"నన్ను 'రౌడీ' అని ఎవరన్నారు?" నా కంఠంలో విస్మయం.

"నువ్వు 'రౌడీ'వని కాలేజీలో ఆడపిల్లలంతా అనుకుంటున్నారు" పూజిత కంఠంలో చిలిపితనం.

ఆ మాటలు విని నవ్వుతూ - "ఆడపిల్లలు 'రౌడీ' అబ్బాయిల్ని ప్రేమిస్తారంట కదా! అందుకే 'రౌడీ' నయ్యాను" అన్నాను.

"ఎంతమంది ప్రేమించాలేం నిన్ను? నేనొక్కదాన్ని ప్రేమిస్తే చాలదా" నాకు దగ్గరగా వచ్చి 'షర్ట్' బటన్స్ పెడుతూ అంది. "ఇక నుంచి నువ్వు రౌడీ లాగా ప్రవర్తిస్తే నేనొప్పుకోను. తెలిసిందా?" నా పూజిత కంఠంలో అధికారం.

నేను మరీ బుద్ధిమంతుడిలా తల వూపి పూజిత నడుం చుట్టూచేతులు చుట్టి హృదయానికి హత్తుకొని అలాగే కొన్ని నిమిషాల వరకు వుండిపోయాను. నక్షత్రాలు పొదగబడిన మల్లె దండలు ఆకాశం నుంచి జారి మమ్మల్ని అభిషేకిస్తున్న అనుభూతి. అలా ఎంతసేపుండిపోయామో తెలియదు. తల ఎత్తేసరికి - వర్షం తగ్గి ఆకాశం మీద కొచ్చిన చంద్రుడు - చంద్రుని చుట్టూ నక్షత్రాలు! ●